Technical Bulletin 03/2013

# పశువులు, జీవాలకు మరియు కోళ్ళకు సోకే ముఖ్యమైన వ్యాధులు - నివారణ

డి. సుధీర్

డి. బి. వి. రమణ

పి. కె. పంకజ్

యమ్. ప్రభాకర్

కె. దత్తాత్రి

బి. వెంకటేశ్వర్లు

కృషి విజ్ఞాన కేంద్రం, రంగా రెడ్డి జిల్లా

కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధన సంస్థ (క్రిడా)

హయత్‌నగర్ పరిశోధన క్షేత్రము, హైదరాబాద్ - 501 505.

**కూర్పు మరియు సంకలనము:** డి. సుధీర్,, డి. బి. వి. రమణ, పి. కె. పంకజ్, యమ్. ప్రభాకర్, కె. దత్తాత్రి, బి. వెంకటేశ్వర్లు. 2013 పశువులు, జీవాలకు మరియు కోళ్ళకు సోకే ముఖ్యమైన వ్యాధులు - నివారణ.
**కృషి విజ్ఞాన కేంద్రం, కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధన సంస్థ,** హైదరాబాద్. 32 పేజీలు.

అక్టోబర్ 2013
©సర్వ హక్కులు ప్రచురణ కర్తలవి

ప్రచురణ :

**డా॥ బి. వెంకటేశ్వర్లు**

సంచాలకులు

**కేంద్రీయ మెట్టవ్యవసాయ పరిశోధన సంస్థ**

సంతోష్‌నగర్, హైదరాబాద్ - 500 059.

ఫోన్ : 040-24530177 (O), 24532262 (R )

ఫ్యాక్స్ : 040-24331802 / 24535336

ఇ-మెయిల్ : root@crida.in

వెబ్ : htt://www.crida.in

Printed at : Balaji Scan Pvt. Ltd.
#10-2-289/4, A.C. Guards, Hyderabad - 500 004.
Ph : 2330 3424, 6610 7719, Cell : 9248007730-39
E-mail : bsplpress@gmail.com

# విషయ పట్టిక



| క్ర.సం | విషయ సూచిక | పేజి నెం. |
|---|---|---|
| 1. | **పశువుల రోగ లక్షణాలు - అనుమానింపదగిన వ్యాధులు** | 2-3 |
| 2. | **పశువుల్లో బాక్టీరియా వలన వచ్చే వ్యాధులు**<br>గొంతు వాపు వ్యాధి, జబ్బ వాపు వ్యాధి | 3-4 |
| 3. | **పశువుల్లో వైరస్ వలన వచ్చే వ్యాధులు**<br>గాలికుంటు వ్యాధి, మశూచి వ్యాధి | 5-6 |
| 4. | **పశువుల్లో అంతర పరాన్న జీవుల వలన వచ్చే వ్యాధులు**<br>కార్జపు జలగల వ్యాధి, కుందేటి వ్యాధి, థైలేరియాసిస్, బెబీసియాసిస్ | 7-10 |
| 5. | **పశువుల్లో బాహ్య పరాన్న జీవుల బెడద**<br>పేలు, గోమార్లు, మిన్నల్లల వలన నివారణ చర్యలు | 11-12 |
| 6. | **పశువుల్లో ఇతర వ్యాధులు**<br>పాల జ్వరం, పొదుగు వాపు వ్యాధి | 12-14 |
| 7. | **జీవాలలో బాక్టీరియా వలన వచ్చే వ్యాధులు**<br>చిటుకు రోగము, కాలు పుండు వ్యాధి | 15-16 |
| 8. | **జీవాలలో వైరస్ వలన వచ్చే వ్యాధులు**<br>గాలికుంటు వ్యాధి, నీలి నాలుక వ్యాధి, బొబ్బ రోగము, పుర్రు రోగము | 17-20 |
| 9. | **జీవాల్లో అంతర పరాన్న జీవుల వలన వచ్చే వ్యాధులు**<br>హీమాంకోసిస్ వ్యాధి, పొట్ట జలగల వ్యాధి, కార్జపుజలగల వ్యాధి, బద్దెపురుగుల వ్యాధి | 21-23 |
| 10. | **జీవాల్లో బాహ్య పరాన్న జీవుల బెడద** | 24 |
| 11. | **గొర్రెల ఆరోగ్య సూచిక** | 25 |
| 12. | **కోళ్ళల్లో వైరస్ వలన వచ్చే వ్యాధులు**<br>కొక్కర తెగులు, కోళ్ళ మశూచి, కొరైజ | 26 |
| 13. | **కోళ్ళల్లో బాక్టీరియా వలన వచ్చే వ్యాధులు**<br>పుల్లోరం, ఎస్సరీషియా కోలై | 27 |
| 14. | **అంతర పరాన్న జీవుల వలన వచ్చే వ్యాధి**<br>కాక్సీడియోసిస్ | 27 |
| 15. | **టీకా మందుల వాడకంలో జాగ్రత్తలు** | 27 |
| 16. | **మార్కెట్లో లభించే కొన్ని టీకా మందుల వివరాలు** | 28 |

**రంగారెడ్డి జిల్లా విస్తీర్ణంలో చాలా చిన్నది (7,53,000 హె.) కానీ ఎంతో అభివృద్ధి చెందిన జిల్లా. అధిక జనసాంద్రత గల ఈ జిల్లాలో 5,00,000 పాడి పశువులు, 9,00,000 ఇతర జీవాలు, 14,00,000 కోళ్ళ పరిశ్రమతో వృద్ధిలో వుంది.**

రాష్ట్ర పశుసంవర్ధక శాఖ తెలిపిన గత ఐదు సంవత్సరాల గణాంకాలను మనం పరిశీలించినట్లయితే జిల్లా జనాభాకు అవసరమైన పాలు, మాంసము మరియు గ్రుడ్లు అవసరాలను దృష్టిలో వుంచుకొని ఈయొక్క పశువులు, జీవాలకు మరియు కోళ్ళకు ముఖ్యంగా వచ్చేవ్యాధుల నివారణ కొరకు రైతు సోదరులకు అవగాహన కల్పించ అవసరం ఎంతైనా వుంది.

## రంగారెడ్డి జిల్లాలో గత ఐదు సంవత్సరాలలో పాలు, మాంసం మరియు గ్రుడ్ల ఉద్పాదక వివరాలు

| వివరాలు | 2005-06 | 2006-07 | 2007-08 | 2008-09 | 2009-10 |
|---|---|---|---|---|---|
| **పాల ఉత్పత్తి (లక్ష మె.ట.)** | 1.64 | 1.70 | 1.85 | 1.96 | 2.17 |
| **మాంసం ఉత్పత్తి (మె.ట.)** | 26,880 | 28,154 | 32,825 | 36,040 | 40,979 |
| **గ్రుడ్ల ఉత్పత్తి (లక్షల్లో)** | 22,598 | 22,109 | 24,360 | 25,021 | 26,308 |



# పశువుల రోగ లక్షణాలు - అనుమానింపదగిన వ్యాధులు

| ముఖ్య లక్షణం | ఇతర లక్షణాలు | అనుమానింపదగిన వ్యాధులు |
|---|---|---|
| మేత మేయకపోవడం | నోటిలో పుండ్లు | గాలికుంటు వ్యాది |
| | తీవ్రమైన జ్వరం | గొంతువాపు, జబ్బవాపు, గాలికుంటువ్యాధి, శ్వాసకోశ వ్యాధి, థైలేరియాసిన్, బెబిషియోసిన్, వడదెబ్బ |
| | కడుపు ఉబ్బడం | గొంతువాపు, జబ్బవాపు |
| విరోచనాలు | వాసనతో కూడిన విరేచనాలు | ఇ-కొలై, సాల్మోనెల్లా మరియు ఇతర సూక్ష్మజీవుల వ్యాధులు |
| | పలుచటి విరేచనాలు | జలగవ్యాధి, పొట్టజలగలు, ఏలికపాములు, అంతర్ పరాన్నజీవుల వలన కలిగే వ్యాధులు |
| | రక్తంతో కూడిన విరేచనాలు | దొమ్మవ్యాది, కాక్సిడియోసిన్, థైలేరియాసిс |
| నడవలేక పోవడం | కాళ్ళలో పుండ్లు ఏర్పడటం | గాలికుంటువ్యాధి, గిట్టలమధ్య గాయాలు, నాగలికర్రు వలన ఏర్పడిన గాయాలు |
| | కుంటుతూ నడవడం | కీళ్ళనొప్పులు, జబ్బవాపు, కండరాల నొప్పులు, ఎముకలు విరిగినప్పుడు, నీరసించిపోవడం |
| | ఏ రకమైన లక్షణాలు లేకుండా | పాలజ్వరం, కాల్షియం, విటమిన్-డి లోపం వలన |
| ఈసుకుపోవడం | చూలు తొలిమాసాలలో ఈసుకుపోవడం | విబ్రియోసిс |
| | చూలి చివరిదశలో ఈసుకుపోవడం | బ్రుసెల్లోసిస్, థైలేరియాసిస్, శ్వాసకోశవ్యాధి |
| | ఏ దశలో నైనా ఈసుకుపోవడం | పశువులు పోట్లాడుకొని పొడుచుకోవడం, పాముకాటు, గర్భకోశవ్యాధులు, పోషణ సరిగా లేకపోవడం, శ్వాసకోశవ్యాధి |
| | తల్లి ఆవు గేదె ఈసుకు పోవడం | బ్రుసెల్లోసిన్, విబ్రియోసిస్, ట్రైకోమోనియాసిస్, గాలికుంటు, థైలేరియాసిస్ |

| | | |
|---|---|---|
| దూడల మరణాలు | ముక్కునుండి చీమిడి కారడం | న్యూమెనియా, ఆజాగ్రత్తగా మందులు త్రాగించడం, అంతర్‌పరాన్న జీవుల వలన |
| | ఏ రకమైన లక్షణాలు లేకుండా | ధనుర్వాతము, దొమ్మ, విటమినులలోపం వలన, పోషణసరిగా లేకపోవడం వలన |
| అకస్మాత్తు మరణాలు | ఏ లక్షణాలు లేకుండా ముక్కు నోటి నుండి రక్తస్రావం | దొమ్మ, వడదెబ్బ, మూగబంతి, పాముకాటు |

# పాడి పశువులలో సోకే ముఖ్యమైన వ్యాధులు

## బాక్టీరియా వలన వచ్చే వ్యాధులు

### గొంతువాపు వ్యాధి (హీమరేజిక్ సెప్టిసీమియా)

వర్షాకాలంలో ఈ వ్యాధి ఎక్కువగా దున్నలు, గేదెలలో వస్తుంది. నీరసంగా ఉన్న పశువులకు ఈ వ్యాధి త్వరగా సోకుతుంది. పల్లపు ప్రాంతాలలో, వర్షపు నీరు నిలిచే ప్రాంతాలోని పశువులలో ఈ వ్యాధి ఎక్కువగా వస్తుంది. ఈ వ్యాధిని "గురక వ్యాధి" అని కూడా పిలుస్తారు.

**వ్యాధి ఎలా వస్తుంది?**

- ఒక రకమైన పస్సెరెల్ల్ మల్టోసిడ (బాక్టీరియా) వలన ఈ జబ్బు పశువులకు సంక్రమిస్తుంది.
- అలసిపోయిన, బలహీనంగా ఉన్న పశువులకు ఈ వ్యాది త్వరగా వస్తుంది.

**వ్యాధి లక్షణాలు**

- జ్వర తీవ్రత 104 $^{o}$F - 106 $^{o}$F పెరిగి పశువు చనిపోతుంది.
- కళ్ళు ఎర్రబడి నీరు కారుతూ ఉంటాయి.
- గొంతు పైభాగాన, మెడ క్రింద వాపు ఉంటుంది.
- పశువు ఆయాసపడుతూ శ్వాస పీలుస్తుంది. శ్వాస పీల్చేప్పుడు, గురు గురు మని శబ్ధం వస్తుంది.
- నాలుక బయటకు తీస్తూ, శ్వాస తీసుకోవడం కష్టమవుతుంది. అశ్రద్ధ వహిస్తే చివరకు పశువు చనిపోతుంది.

### వ్యాధిని ఎలా నివారించాలి?

- తొలకరి వర్షాలకంటే ముందుగా మే, జూన్, మాసాలలో వ్యాధినిరోధక టీకాలు వేయించాలి.
- పశువుల పోషణలో జాగ్రత్తలు తీసుకోవాలి
- వ్యాధి సోకిన పశువులను మంద నుండి వేరు చేయాలి.
- పాకలను ఎప్పటికప్పుడు శుభ్రపరచాలి
- వ్యాధి సోకిన చనిపోయిన పశువులను సున్నపు గోతిలో పూడ్చాలి.

### చికిత్స

- పశువైద్యుని సలహాను పాటించి వ్యాధి సోకిన వాటికి యాంటీబయోటిక్స్ మరియు ఇతర మందులు వాడాలి. వ్యాధి ముదిరిన తరువాత చికిత్సకు ఫలితం వుండదు.

## జబ్బ వాపు వ్యాధి (బ్లాక్ క్వార్టర్)

ఆరు మాసాల నుండి రెండు సంవత్సరాలలోపు వయసుగల, బలంగా ఆరోగ్యంగా వున్న పశువులలో ఈ వ్యాధి ఎక్కువగా వస్తుంది. ఈ వ్యాధి తొలకరి చినుకులు పడ్డ తరువాత వస్తుంది. సాధారణంగా ఉష్ణ ప్రాంతాలలో, గాలిలో తేమ ఎక్కువగా ఉన్నప్పుడు ఈ వ్యాధి ఎక్కువగా ప్రబలుతుంది. ఈ వ్యాధి ఎక్కువగా తెల్లజాతి పశువులలో వస్తుంది.

### వ్యాధి ఎలా వస్తుంది?

- ఒక రకమైన క్లాస్ట్రిడియం చౌవై (బాక్టీరియా) వలన ఈ జబ్బు పశువులకు సంక్రమిస్తుంది.
- కలుషితమైన ఆహారం, నీరు ద్వారా ఈ వ్యాధి త్వరగా వ్యాపిస్తుంది.

### వ్యాధి లక్షణాలు

- చిన్న పశువులు అకస్మాత్తుగా మరణిస్తాయి. చాలా సందర్భాలలో వ్యాధి లక్షణాలను గుర్తించక ముందే పశువులు మరణిస్తాయి.
- జ్వర తీవ్రత 104 $^{o}$F - 106 $^{o}$F పెరిగి పశువులు చనిపోతాయి.
- పశువు ఆకలి మందగించి నీరశించి పోతాయి.
- జబ్బ మరియు తొడ కండరాలపైన వాపు కనబడుతుంది.
- ముందుగా వాపు ఉన్నచోట వేడిగాను, నొప్పిగాను ఉంటుంది.
- వాపు ఉన్నచోట తాకినచో కరకరమని శబ్ధం వస్తుంది.

### వ్యాధిని ఎలా నివారించాలి?

- వర్షాలకు ముందే వ్యాధి నిరోధక టీకాలు ఇప్పించాలి
- వ్యాధి సోకిన పశువుల మలమూత్రాలను, గడ్డిని కాల్చివేయాలి.

- చనిపోయిన పశువును సున్నపు గోతిలో పూడ్చాలి.

**చికిత్స**

- పశువులలో వ్యాధి లక్షణాలు కనపడిన వెంటనే డాక్టరును సంప్రదించి, పెన్సిలిన్ మరియు ఇతర యాంటీబయాటిక్ మందులు ఇప్పించాలి.

# వైరస్ వలన వచ్చే వ్యాధులు

## గాలికుంటు వ్యాధి (పుట్ అండ్ మౌత్)

దేశవాళి పశువుల్లో కన్నా సంకరజాతి పశువుల్లో ఈ వ్యాధి తీవ్రత ఎక్కువగా వుంటుంది. దేశవాళి పశువుల్లో ప్రాణనష్టం అంతగా ఉండదు. ఎద్దులు వ్యవసాయపనులు సరిగా చేయవు. మార్చి, ఏప్రిల్ మరియు ఆగష్టు, సెప్టెంబరు మాసాలలో ఈ వ్యాధి ఎక్కువగా వచ్చును.

**వ్యాధి ఎలా వస్తుంది?**

- వ్యాధిసోకిన ఆవుల, గేదెల పాలద్వారా దూడలకు వ్యాపిస్తుంది.

**వ్యాధి లక్షణాలు**

- జ్వర తీవ్రత 104 $^{o}$F - 106 $^{o}$F పెరిగి పశువు నీరసించిపోతాయి.
- పశువుల నోటిలో, చిగుళ్ళపై పొక్కులు ఏర్పడటం చేత పశువులు మేత, నీరు తీసుకోక నీరసించి పోతాయి. నోటి నుండి చొంగకారుతూ వుంటుంది.
- నోరు మరియు గిట్టల మధ్య బొబ్బలు ఏర్పడి, 3,4 వారాల్లో బొబ్బలు చితికి, పుండ్లుగా మారి చర్మముగరుకుగా తయారవుతుంది.
- పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గుతుంది.
- గిట్టలలో పుండ్లు ఏర్పడటం వలన ఎద్దులు వ్యవసాయ పనులు చేయలేవు

**వ్యాధిని ఎలా నివారించాలి?**

- వ్యాధిసోకిన పశువులను వేరుచేయాలి.
- పశువుల పాకలను క్రిమిసంహారక మందులతో, వాషింగ్‌సోడాతో కడగాలి.
- వ్యాధి సోకిన పశువుల మలమూత్రాలను, గడ్డితో కాల్చివేయాలి.
- చనిపోయిన పశువును సున్నపు గోతిలో పూడ్చాలి.
- వ్యాధిసోకిన పశువుల పాలను దూడలకు త్రాగించకూడదు.
- మార్చి - ఏప్రిల్ మరియు ఆగష్టు- సెప్టెంబరు మాసాలకు ముందుగా వ్యాధినిరోధక టీకాలు తప్పనిసరిగా ఇప్పించాలి.

**చికిత్స**

- కాలిగిట్టల మధ్య పుండ్లను పొటాషియం పర్మాంగనేట్ ద్రావణంతో కడిగి, ఈగలు వాలకుండా నీమెలెంట్, వేపనూనె పూయాలి.
- నోటిలోని పుండ్లకు బోరిక్ పౌడర్, గ్లిసరిన్ కలిపి పూయాలి.
- డాక్టరును సంప్రదించి అవసరమైన యాంటిబయాటిక్ మరియు నొప్పి నివారణ మందులు వాడాలి.

## మశూచి వ్యాధి (ఫాక్స్ వ్యాధి)

ఈ వ్యాధిని అమ్మవారు లేదా ఫాక్స్ వ్యాధి అని కూడా పిలుస్తారు. ఈ వ్యాధి ఆవులలో, గేదెలలో కూడా వచ్చును. ఆవులతో పోలిస్తే గేదెలలో ఈ వ్యాధి తక్కువగా వస్తుంది. పొదుగుపైన, చన్నుల పైన పొక్కులు ఎక్కువగా కనపడతాయి.

**వ్యాధి ఎలా వస్తుంది?**

- ఈ వ్యాధి వైరస్ వలన సోకే అంటువ్యాధి
- ఈ వైరస్ చర్మం ద్వారా శరీరంలోకి ప్రవేశించి వృద్ధి చెందుతుంది.
- ఈ వ్యాధి పాలు పితికే మనుష్యుల ద్వారా ఒక పశువు నుండి ఇంకో పశువుకు వ్యాప్తి చెందుతుంది.

**వ్యాధి లక్షణాలు**

- ముందు ఎర్రటి సన్నని పొక్కులు కనిపించి తరువాత పొక్కులు పెద్దవి అవుతాయి.
- పొదుగుపైన బొబ్బలు గుండ్రముగా, చన్నులు మీద పొడుగ్గా ఉంటాయి.
- మగ పశువులలో పొక్కులు బీర్జాలపై, తొడలోపల ఏర్పడతాయి.
- వ్యాధి సోకిన పశువుల్లో జ్వర తీవ్రత 104 $^{o}$F - 105$^{o}$F వరకు ఉంటుంది.

**వ్యాధిని ఎలా నివారించాలి?**

- వ్యాధిసోకిన పశువులను వేరుచేయాలి.
- పాలు పితికేటప్పుడు చేతులు శుభ్రంగా కడుగుకొని పాలు పితకాలి. ముందుగా వ్యాధులు లేని పశువుల పాలు పితకాలి ఆతరువాత వ్యాధివున్న పశువుల పాలు పితకాలి.
- వ్యాధి సోకిన పశువు యొక్క పాలను మరగకాచి త్రాగాలి.

**చికిత్స**

- వ్యాధి సోకిన లక్షణాలు, పొక్కులు కనపడిన వెంటనే డాక్టరు సలహాతో ఆంటీ బయాటిక్ మరియు ఇతర మందులు వాడాలి.

- పొక్కులను 1% పొటాషియం పర్మాంగనేటు ద్రావణంతో కడిగి బోరిక్ పౌడర్ ఆయింటమెంట్ గాని, ఆంటీబయెటిక్ ఆయింట్‌మెంట్ గాని పూయాలి.
- 15-20 రోజులలో పుండ్లు పూర్తిగా మానిపోతాయి

# అంతర పరాన్నజీవుల వలన కలిగే వ్యాధులు

## కార్జపు జలగ వ్యాధి (లివర్ ఫ్లుక్)

నత్తలు వృద్ధి చెందడానికి అనుకూల పరిస్థితులు గల అన్ని ప్రదేశాలలో ఈ వ్యాధి ఎక్కువగా వ్యాపిస్తుంది. జలగలు పశువుల కార్జంలోనికి వెళ్లి కార్జాన్ని నాశనం చేస్తాయి.  ఒకసారి కార్జం చెడిపోతే పశువులు కోలుకోవు.  చికిత్స చేయని పశువులు మరణిస్తాయి.

### వ్యాధి ఎలా వస్తుంది?

- వ్యాధి సోకిన పశువుల పేడ ద్వారా జలగల గుడ్లు నేలమీద పడతాయి
- ఈ ప్రదేశాలలో మొలచిన గడ్డిని పశువులు మేసినప్పుడు ఈ గుడ్లు పశువుల కార్జంలోనికి చేరి వ్యాధిని కలగుజేస్తాయి.

### వ్యాధి లక్షణాలు

- ఆకలి మందగిస్తుంది పశువులు మేత మెయ్యవు.
- దవడ క్రింద నీరు వచ్చి వాపు కనిపిస్తుంది.  ఉదయం పూట ఈ వాపు ఎక్కువగా ఉంటుంది.
- పేడ పలచగా వుండి దుర్వాసన కలిగి పచ్చగా ఉంటుంది.
- వ్యాధి ముదిరిన పశువులలో వెన్నెముక కత్తివలె మొనదేలి ఉంటుంది.
- పశువు బలహీన పడుతూ పాల ఉత్పత్తి తగ్గిపోతోంది.

### వ్యాధిని ఎలా నివారించాలి

- ఈ వ్యాధి ఉధృతముగా ఉన్న ప్రాంతాలలో నత్త గుల్లలను నివారించాలి.
- ఒక భాగము మైలతుత్తం ఐదు భాగాలు ఇసుక కలిపిన మిశ్రమాన్ని నత్తగుల్లలున్న పచ్చిక బయళ్ళలో ఎకరానికి పది నుంచి పదిహేను కిలోల మైలతుత్తం చొప్పున నత్తలను నాశనం చేయవచ్చు
- చెరువుల అంచున, నాచును తీసివేసి శుభ్రం చేయాలి.
- మేతమేసే ప్రాంతాలను పరిమితం చేసి, చుట్టూ కంచె వేసుకోవాలి
- బాతులు పెంపకం వలన కూడా నత్తలను నివారించవచ్చు.
- సంవత్సరానికి కనీసం 3 సార్లు జలగ వ్యాధి నిరోధక నట్టల మందు వాడాలి.

### చికిత్స

- పేడ పరీక్ష చేసిన తరువాత డాక్టరు గారి సలహాతో నట్టల మందు త్రాగించాలి.

# కుందేటి వ్యాధి (సర్రా)

(ట్రిపేనో జోమియాసిస్)

ఈ వ్యాధిసోకిన పశువు నలకప్పు వేసి నీరసించి కళ్లు ఎర్రబడతాయి. పళ్ళు కొరుకుతూ, గుండ్రంగా తిరుగుతూ ఉంటాయి. ఈ వ్యాధిని సర్రా, ట్రిపనోసోమియాసిస్, తిరుగుడు రోగం అని కూడా అంటారు.

## వ్యాధి ఎలా వస్తుంది?

- ఈ వ్యాధికారక క్రిములు పశువుల రక్తములోనికి జోరీగల ద్వారా ప్రవేశించి వ్యాధిని కలగజేస్తాయి.
- వ్యాధిసోకిన పశువును జోరీగలు కుట్టిన తరువాత ఆరోగ్యమైన పశువును కాటువేసినప్పుడు ఒక పశువు నుండి మరొక పశువుకు వ్యాపిస్తుంది.

## వ్యాధి లక్షణాలు

- పశువులు బలహీనంగా ఉంటాయి. పళ్ళు కొరుకుతూ గుండ్రంగా తిరుగుతాయి.
- పశువు వెర్రి చూపులు చూస్తుంది.
- చూపు మందగించి, కళ్ళు ఎర్రబడతాయి. కొన్నిసార్లు చూపు పోతుంది.
- పశువు వణుకుతూ ఉండి కొన్ని సమయాల్లో ఫిట్స్ కూడా వస్తాయి.
- తరచూ మూత్రవిసర్జన చేస్తుంది.
- జ్వర తీవ్రత 102$^{o}$F - 104ºF వరకు ఉంటుంది. ఆకలి మందగిస్తుంది.
- కొన్ని పశువుల్లో కాళ్ళపై, పొట్టపైన మరియు దవడ క్రింద వాపు వస్తుంది.
- పాడిపశువుల్లో పాలు తగ్గుతాయి.
- అన్ని పశువులలోను ఒకేరకమైన లక్షణాలు కనిపించవు.
- కొన్ని పశువులు అప్పటికప్పడే చనిపోతాయి.

## వ్యాధిని ఎలా నివారించాలి

- వ్యాధి సోకిన పశువులను మంద నుండి వేరుచేయాలి.
- ఈగలు, దోమలను, క్రిమిసంహారక మందులతో నిర్మూలించాలి.
- పాకలలో ధారాళంగా గాలి, వెలుతురు వచ్చేటట్లు చూడాలి.
- పాకలను శుభ్రంగా ఉంచాలి.

## చికిత్స

- వ్యాధి లక్షణాలు గుర్తించిన వెంటనే డాక్టరు సలహా ప్రకారము బెర్నిల్ వంటి మందులను వాడాలి. శక్తినిచ్చే గ్లూకోజ్‌తో పాటు ఇతర విటమిను ఇంజక్షనులు ఇప్పించాలి.

# థైలేరియాసిస్

ఈ వ్యాధి ముఖ్యంగా అధిక పాల దిగుబడి నిచ్చే సంకరజాతి ఆవులలో ఎక్కువగా వస్తుంది. అన్ని వయస్సుల పశువులకు ఈ వ్యాధి సోకుతుంది. ఈ వ్యాధి వేసవికాలంలోను మరియు వర్షాకాలంలో ఎక్కువగా కనపడుతుంది.

**వ్యాధి ఎలా వస్తుంది?**

ఈ వ్యాధి ఒక రకమైన పరాన్న జీవుల వలన కలుగుతుంది. గోమార్ల ద్వారా ఒక పశువు నుండి మరొక పశువుకు సంక్రమిస్తుంది.

**వ్యాధి లక్షణాలు**

- వ్యాధిసోకిన పశువుల లింపుగ్రంధులు వాచి ఉంటాయి
- ముక్కునుండి నురగ కారుతుంది. శ్వాస తీసుకొనడంలో కష్టమౌతుంది.
- కళ్ళు ఎర్రబడి, ఒక్కోసారి కంట్లో పువ్వువేయడం జరుగుతుంది.
- వ్యాధిసోకిన పశువులు తీవ్ర జ్వరంతో బాధపడతాయి. 104 $^{o}$F - 106$^{o}$F వరకు జ్వరం ఉంటుంది. ఆకలి మందగించి పశువు నీరసించిపోతుంది.
- చూడి ఆవులు ఈడుసుకుపోతాయి.
- పాల దిగుబడి ఆకస్మాత్తుగా తగ్గిపోతుంది. పశువులు కోలుకున్నప్పటికి వాటి ఉత్పాదక శక్తిపోయి రైతులు ఆర్థికంగా చాలా నష్టపోతారు.
- వ్యాధిసోకిన పశువులలో రక్తం మరియు బంకతో కూడిన విరోచనాలు ఉంటాయి.

**వ్యాధిని ఎలా నివారించాలి**

- "రక్షా-టి" వ్యాధినిరోధక టీకామందులు సంవత్సరానికి ఒకసారి ఇప్పించాలి. దూడలకు 4 నెలల వయస్సులో ఇప్పించాలి.
- గోమార్లు వ్యాప్తి చెందకుండా, కొట్టం పరిసర ప్రాంతాలను క్రిమిసంహారక మందులతో పిచికారి చేయాలి.

**చికిత్స**

- డాక్టరు సలహా ప్రకారం యాంటిబయోటిక్ మందులు, విటమిన్ ఇంజక్షన్లు ఇప్పించాలి.

# బెబీసియోసిస్

ఈ వ్యాధి అన్ని రకాల మరియు అన్ని వయస్సుల పశువులలో సంక్రమిస్తుంది. వ్యాధి సోకిన పశువులలో పరాన్నజీవుల వలన ఎర్ర రక్తకణాలు క్షీణించిపోతాయి. దీనివలన పశువులలో రోగ నిరోధకశక్తి తగ్గిపోతుంది.

**వ్యాధి ఎలా వస్తుంది?**

- ఈ వ్యాధి పరాన్న జీవుల వలన కలుగుతుంది. గోమార్ల ద్వారా ఒక పశువు నుండి మరొక పశువుకు సంక్రమిస్తుంది.
- తేమ ఎక్కువగా ఉండే ప్రదేశాలలో ఈ వ్యాధి ఎక్కువగా వస్తుంది.

**వ్యాధి లక్షణాలు**

- ఈ వ్యాధిసోకిన పశువులలో మూత్రం ఎరుపు రంగులో లేదా కాఫీ రంగులో ఉంటుంది.
- రక్తహీనత ఏర్పడడం వలన పశువు నీరసించిపోతుంది. కామెర్ల వ్యాధి కూడ రావచ్చు.
- పశువులు నీరసించి, పాలదిగుబడి, పనిచేసే సామర్ధ్యం తగ్గిపోతుంది.
- జ్వర తీవ్రత అధికంగా 104 $^{o}$F - 106$^{o}$F వరకు ఉంటుంది.
- ఆకలి మందగించి పశువులు నెమరు వేయవు.
- దూడలలో వ్యాధి లక్షణాలు స్పష్టంగా కనిపించవు.

**వ్యాధిని ఎలా నివారించాలి?**

- పశువుల పరిసరాలను శుభ్రంగా ఉంచాలి.
- గాలి, వెలుతురు బాగా ఉండే ప్రదేశాలలోనే కొట్టం నిర్మంచుకోవాలి.
- పాకలలో తేమ ఎక్కువగా లేకుండా పొడిగా ఉండేటట్లు చూడాలి.
- తొడల మధ్య, మెడ కింద, గోమార్లు ఎక్కువగా ఉంటాయి. కాబట్టి పశువులపై ఎక్టోడెక్స్, బ్యూటాక్స్ వంటి మందులు కలిపిన నీటిని పిచికారి చేయాలి.
- కొట్టంలో కూడ పిచికారి చేసి గోమార్లు నివారించుకోవాలి.

**చికిత్స**

- పశువైద్యునిచే చికిత్స చేయించుకోవాలి.
- పశువులకు సమతుల్య ఆహారం అందించాలి.

# బాహ్యపరాన్నజీవుల బెడద

పశువులపై వుండు బాహ్య పరాన్న జీవులలో పేలు, గోమారులు, మిన్నల్లులు మరియు దోమలు ముఖ్యమైనది.

## పేలు

ఇవి పశువు శరీరముపై వుండి చర్మమునుండి రక్తము పీలుస్తాయి. చర్మంపై గ్రుడ్లు పెడతాయి. ఈ గ్రుడ్లు వెంట్రుకలకు అతుక్కొని వుండి అవి పగిలిన తర్వాత పేలుగామారతాయి. ఈ పేలు ఒక పశువు నుండి వేరొక పశువుకి ఆనుకొని వున్నప్పుడు పశువుల కోసం వాడు పనిముట్ల ద్వారా వ్యాప్తి చెందుతాయి.

ఇది ఎక్కువగా వెంట్రుకలు వున్న జంతువులలో, గేదెదూడలలో కన్పిస్తాయి. ఈ పేలు పెట్టిన పశువుల దురదవలన శరీరాన్ని, గోడలకు, చెట్లకు, రుద్దుతాయి. మేత సరిగ్గా తినవు, పాలుత్పత్తి తగ్గి పోతుంది. రక్తహీనత వస్తుంది. దూడలు సరిగ్గా బరువు పెరగవు.

**చికిత్స** వెంట్రుకలను పూర్తిగా కత్తిరించి పశువైద్యుని సలహాపై మందులు వాడవలయును.

## గోమారులు

ఈ రకమైన కీటకములు పశువుల శరీరంపై గ్రుడ్లు పెడతాయి. వీటి లార్వాలు వాటి జాతిని బట్టి అదే పశువుపై గాని, వేరే పశువుపై గాని పెద్దవిగా మారతాయి. పశువులకు గోమారులు పట్టుట వలన విష పదార్థములను విడుదల చేయుట వలన అవి చికాకుగా వుంటాయి. రక్తహీనత వస్తుంది.చర్మము కాంతిని కోల్పోతుంది. మరియు పాల ఉత్పత్తి తగ్గిపోతుంది.

**చికిత్స** సాధ్యమైనంత వరకు పశువులపై వుండు గోమారులను ఏరివేసి చంపివేయాలి. పశువైద్యుని సలహాపై మందులు వ్రాడవలయును.

## మిన్నల్లులు

పశువులలో వివిధ రకముల మైట్స్‌వలన మేంజ్ వస్తుంది. ఈ జీవులు వెంట్రుకల మొదలలో లేదా చర్మంపై పొరలో సన్నని రంధ్రము చేసుకొని వాటిలో నివసిస్తాయి. శరీరంపై దురద వుంటుంది. చర్మం మొద్దుబారుతుంది. చర్మం పొలుసులుగా ఊడి పోతుంది. చర్మంపై పుండ్లు పడి రసికారుతాయి. ఈ రసిపడ్డ చోట తిరిగి చర్మం వ్యాధికి లోనవుతుంది. పాల ఉత్పత్తి తగ్గిపోతుంది. పుండ్లపై బాక్టీరియా చేరటం వలన చీము పట్టవచ్చును. చర్మముపై వెంట్రుకలు రాలిపోతాయి.

## బాహ్యపరాన్న జీవుల నివారణ

- బాహ్య పరాన్న జీవులు శరీరముపై కన్పించిన వెంటనే పశువుకు చికిత్స చేసి అదే సమయములో షెడ్‌లలో కూడా క్రిమిసంహారక మందును చల్లాలి. ఈ మందులను తిరిగి పదిహేను రోజుల తర్వాత రెండవసారి చల్లుకోవటం మంచిది.
- మురుగు నీరు నిలుచుండు ప్రాంతాలలో దోమలు ఎక్కువగానుండుటకు ఆస్కారం కలదు. కావున షెడ్‌ల చుట్టు ప్రక్కల ప్రాంతాలలో నీరు నిలువకుండా జాగ్రత్త పడాలి.
- షెడ్‌ల చుట్టు ప్రక్కల ప్రాంతాలలో డి.డి.టి. వంటి క్రిమి సంహారక మందును చల్లవలెను.
- పశువుల చర్మంపై వెంట్రుకలను ఎప్పటికప్పుడు తీసివేయవలెను.
- పశువులపై అప్పుడప్పుడు డిప్పింగ్, స్ప్రేయింగ్ పద్ధతులలో పశు వైద్యులు సూచించిన క్రిమి సంహారక మందులను చల్లాలి.

## పాడి పశువుల్లో ఇతర వ్యాధులు

### పాల జ్వరం (మిల్క్ ఫీవర్)

ఈ జబ్బు ఆవులలో, గేదెలలో ఈనిన మొదటి వారములోనే వస్తుంది. అధిక పాల ఉత్పత్తినిచ్చే సంకర జాతి పశువులకు ఈ జబ్బు ఎక్కువగా వస్తుంది. ఈనిన వెంటనే పాలు పిండుట వలన కూడా ఈ వ్యాధి సోకుతుంది.

**వ్యాధి ఎలా వస్తుంది?**

- ఈ వ్యాధి కాల్షియం లోపము వల్ల కలుగుతుంది.
- జున్నుపాలు మరియు సాధారణ పాలలో పశువు శరీరంలోని కాల్షియం దాతువు లోపించడం వలన మరియు పశువు ఈనిన తరువాత ఈ వ్యాధి కలుగుతుంది.

**వ్యాధి లక్షణాలు**

- పశువు తల, మెడ ఒక వైపుకు తిరిగి తలను డొక్కలో పెట్టుకొని పడుకుంటుంది.
- నీరసముతో మేత మేయ్యవు.
- ఈ వ్యాధిసోకిన పశువులలో క్రిందపడిపోవుట, తన్నుకొనుట, కండరాలు వణుకుట వంటి లక్షణాలు కనపడుతాయి.
- కళ్ళు నుండి నీరు కారుతూ, చెవులు వాలి ఉంటాయి.
- కొన్ని పశువులలో చూపు మందగించ వచ్చును.
- పశువు చిరాకుగా వుండి ఉలికిపడుతుంది.

**వ్యాధిని ఎలా నివారించాలి?**

- ఈనిన వెంటనే పొదుగును శుభ్రపరచవలెను.
- ఈనిన వెంటనే పొదుగు నుండి మొత్తం పాలు పితకకూడదు.
- పశువు చూడితో ఉండగానే లేక ఈనిన తరువాత కాల్షియం, మెగ్నిషియం ఖనిజ లవణాలు డాక్టరుతో సంప్రదించి సరియైన మోతాదులో ఇప్పించాలి.

**చికిత్స**

- డాక్టరును వీలైనంత త్వరగా సంప్రదించి కాల్షియం ఇంజక్షన్లు ఇప్పించాలి.
- అశ్రద్ధ చేసిన, జబ్బు ప్రమాదకరంగా మారి పశువులకు తీరని నష్టము కలుగజేస్తుంది.

# పొదుగు వాపు వ్యాధి

(మ్యాస్టైటిస్)

ఈ జబ్బు పాల ఉత్పత్తి ఎక్కువగా ఉన్న పశువులలో మరియు సంకరజాతి పశువులలో వచ్చును. ఈ జబ్బు సోకిన పశువులలో పాల ఉత్పాదకశక్తి తగ్గుతుంది. ఈ వ్యాధి పాలిచ్చే పశువులలో ఏ సమయంలోనైనా సోకి రైతుకు నష్టం కలిగిస్తుంది.

**వ్యాధి ఎలావస్తుంది?**

- పాలు పితికేటప్పుడు గోటితో కలిగే పుండ్లు, దూడ కొరకుడు పుండ్ల ద్వారా సూక్ష్మజీవులు పొదుగులోనికి ప్రవేశించి పొదుగువాపు కలుగజేస్తాయి.
- పొదుగుకు చిన్న దెబ్బ కలిగినా ఈ వ్యాధి వస్తుంది.
- మురికిగా ఉండే చేతితో పాలు పితకడం వలన మరియు అపరిశుభ్రమైన పరిసరాలలో పాలు పితకడం వలన, ఇతర జబ్బులవల్ల కూడా పొదుగువాపు వస్తుంది.

**వ్యాధి లక్షణాలు**

- వ్యాది సోకిన ఆవుల, గేదెల యొక్క పొదుగు, చన్నులు వాచి ఉంటాయి.
- పొదుగు మరియు చన్నులు ముట్టుకుంటే వేడిగా ఉండి నొప్పితో పశువు బాధపడుతూ ఉంటుంది. పొదుగు గట్టిగా ఉంటుంది.
- పొదుగువాపు ఒక చన్నుకుగాని, అంతకన్నా ఎక్కువ వాటికిగాని ఒకేసారి రావచ్చు.
- పాలు పితికినప్పుడు పాలల్లో పలుకులు లేక నీళ్ళవలె ఉండి పశువు కొద్దిగా పాలు ఇస్తుంది. ఒక్కోసారి పాలధారలో రక్తచారలు కనపడుతాయి.
- పశువు జ్వరముతో బాధపడుతూ మేత మేయక నీరసముగా ఉంటుంది.

## వ్యాధిని ఎలా నివారించాలి?

- పాకలను పరిశుభ్రముగా ఉంచి, వీలైనంత పొడిగా ఉంచాలి.
- పాడి పశువులను పరిశుభ్రముగా ఉంచాలి. పాలు పితికే ముందు పొదుగును గోరువెచ్చని నీళ్ళతో కడిగి శుభ్రమైన గుడ్డతో తుడవాలి.
- పాలు పితికేవారి చేతులకు గోళ్లు లేకుండా శుభ్రముగా వుండాలి.
- పొదుగులో పాలు లేకుండా మొత్తం పితికివేయాలి. ఈనిన పశువుల మానం నుండి కారే చీము, రక్తము, స్రవాలు పొదుగును తాకకుండా ఎప్పటికప్పుడు శుభ్రపరచాలి.

## చికిత్స

- పశువైద్యున్ని వీలైనంత త్వరగా సంప్రదించి ఆంటిబయోటిక్ మందులతో చికిత్స చేయించాలి.
- వ్యాధిని గుర్తించి, చికిత్స ఎంత త్వరగా ప్రారంభిస్తే, ఫలితాలు అంత బావుంటాయి.

# గొర్రెల్లో మరియు మేకలలో సోకే ముఖ్యమైన బాక్టీరియా వలన వచ్చే వ్యాధులు

## చిటుకు రోగం (ఎన్టెరో టాక్సిమియ)

చిటుకు వేసేంతలోనే గొర్రెలు చనిపోతాయి, కావున ఈ వ్యాధిని చిటుకురోగం, నెత్తి పిడుగు వ్యాధి లేదా గడ్డి రోగం అని పిలుస్తారు.

**వ్యాధి ఎలా వస్తుంది?**

బాక్టీరియా వల్ల మరియు తొలకరి వర్షాలు తరువాత పెరిగిన గడ్డి తినడం వలన ఈ వ్యాధి వస్తుంది. ఎక్కువగా జూన్ నుండి జూలై మాసాలలో వస్తుంది. కొదుమలలో (సంవత్సరం వయస్సుగల గొర్రెలు) మరియు వలస వెళ్ళు గొర్రెల్లో ఈ వ్యాధి ఎక్కువగా సంక్రమిస్తుంది.

**వ్యాధి లక్షణాలు**

- ఎటువంటి వ్యాధి లక్షణాలు కనపడకుండానే, గొర్రెలు చనిపోతాయి.
- చనిపోయే ముందుగా గొర్రెలు నీరసంగా ఉంటాయి, గొర్రెలు గిలగిలా కొట్టుకొని, గాలిలోకి ఎగిరి క్రిందపడి వెంటనే చనిపోతాయి.
- ఈ వ్యాధి ఎక్కువగా ఉదయం మరియు మధ్యాహ్నం వేళల్లో కనపడుతుంది.
- మందలోని సుమారు 5-10% గొర్రెలకు ఈ వ్యాధి సంక్రమిస్తుంది.

**వ్యాధిని ఎలా నివారించాలి?**

- వర్షాకాలం కంటే ముందే ఏప్రిల్, మే మాసాలలో మందలోని అన్ని గొర్రెలకు వ్యాధి నిరోధక టీకాలు వేయించి ఈ వ్యాధిని నివారించుకోవాలి.
- మందలోని గొర్రెలలో ఈ వ్యాధిని గమనించిన వెంటనే స్థానిక పశువైద్యుని సలహా తీసుకొని తగు జాగ్రత్తలు పాటించాలి.
- తొలకరి వర్షాలకు మొలచి, వాడిపోయిన లేత గడ్డిని గొర్రెలకు మేపినచో ఈ వ్యాధి ఎక్కువగా వస్తుంది. కాబట్టి వాడిపోయిన గడ్డిని ఎక్కువగా మేపరాదు.
- వ్యాధి సోకిన మందను, ఇతర మందల నుండి దూరంగా ఉంచి, తగు జాగ్రత్తలు తీసుకుంటే వ్యాధి వ్యాప్తి అరికట్ట వచ్చు.

**చికిత్స**

వ్యాధి లక్షణాలు గమనించిన వెంటనే, స్థానిక పశువైద్యుని పర్యవేక్షణలో అంటి బయోటిక్ మందులు ఇంజక్షన్ల రూపేణావాడాలి.

# కాలి పుండు వ్యాధి

(పుట్‌రాట్)

మేత సమయంలో మందలోని కొన్ని గొర్రెలు నడవలేక కుంటుతూ కనిపిస్తాయి. ముఖ్యంగా వర్షాకాలంలో, చిత్తడి నేలపై మంద తిరిగినప్పుడు మరియు వరికోతల తరువాత ఈ లక్షణాలు గమనించవచ్చు.

**వ్యాధి ఎలా వస్తుంది?**

బాక్టీరియా వలన ఈ వ్యాధి సోకుతుంది. నేలలు చిత్తడిగా ఉన్న కాలంలో ఈ వ్యాధి ఎక్కువగా కనపడుతుంది.

**వ్యాధి లక్షణాలు**

- మొదట మందలోని ఒకటి, రెండు గొర్రెలు సరిగా నడవలేక వెనుకపడతాయి.
- వ్యాధి సోకిన గొర్రెల గిట్టల మధ్యభాగం ఎర్రగా కందుతుంది.
- వ్యాధి సోకిన గొర్రె మూడు కాళ్ళమీద గెంతుతుంది
- ఎర్రగా కందిన భాగం ఉబ్బి, చీము పట్టి, నల్లగా కమిలిపోతుంది. ఆ భాగంపైన తొడుగు ఏర్పడి అది క్రమేణా ఊడిపోయి చెడువాసన వస్తుంది.
- వ్యాధి తీవ్రంగా సోకినదశలో గిట్టలు కూడా వూడిపోతాయి.

**వ్యాధిని ఎలా నివారించాలి?**

- వ్యాధి సోకిన గొర్రెలను మందనుండి వేరు చేసి, ఆరోగ్యవంతమైన గొర్రెలకు ఈ వ్యాధిసంక్రమించకుండా జాగ్రత్త పడాలి. వ్యాధిసోకిన గొర్రెలకు చికిత్స చేయించాలి.
- మందను చిత్తడి నేలలో మరియు నీరు నిలిచే ప్రదేశాలలో నిలపకుండా, ఎత్తైన పొడి ప్రదేశాలలో నిలపాలి.
- వ్యాధి సోకిన గొర్రెలు మేసిన ప్రదేశాలలో ఆరోగ్యవంతమైన గొర్రెల మందను మేపకూడదు.

**చికిత్స**

- మందలో వ్యాధి లక్షణాలను గమనించిన వెంటనే దగ్గరలోని పశువైద్యుని పర్యవేక్షణలో పెన్సిలిన్ మరియు నొప్పి నివారణ మందులు వాడాలి.
- వ్యాధి సోకిన గిట్టలను10% ఫార్మలిన్ మరియు కాపర్ సల్ఫేట్ ద్రావణంలో ముంచాలి.

# వైరస్ వలన వచ్చే వ్యాధులు

## గాలికుంటు వ్యాధి (ఫుట్ అండ్ మౌత్)

దీనిని పోచమ్మ రోగం అనికూడా పిలుస్తారు. ఈ వ్యాధి సోకిన గొర్రెల్లో నోరు మరియు గిట్టల మధ్య పుండ్లు ఏర్పడి, గొర్రెలు కుంటుతూ మేత మేయవు. గాలిద్వారా ఈ వ్యాధి వ్యాపించి, పెంపకందార్లకు తీరని నష్టాన్ని కలిగిస్తుంది.

**వ్యాధి ఎలా వస్తుంది?**

ఈ వ్యాధి గాలి ద్వారా వ్యాపిస్తుంది. ఇది అంటు వ్యాధి కాబట్టి మందలోని ఇతర గొర్రెలకు త్వరగా సోకుతుంది

**వ్యాధి లక్షణాలు**

- తీవ్రమైన జ్వరం (104 $^{o}$F - 105 $^{o}$F) ఉంటుంది.
- నోటి నుండి చొంగ కారుతుంది.
- నోరు, నాలిక, గిట్టల మధ్యభాగంలో పుండ్లు పడతాయి.
- నోటిలోని పుండ్ల వలన గొర్రెలు మేత మేయవు. కాలిపుండ్ల వలన కుంటుతూ నడుస్తాయి.
- వ్యాధి సోకిన గొర్రె పిల్లలు ఎక్కువగా మరణిస్తాయి.
- చూడి గొర్రెలు ఈసుకునిపోతాయి.

**వ్యాధిని ఎలా నివారించాలి?**

- వ్యాధి సోకిన జీవాలను మంద నుండి వేరు చేయాలి.
- ఏప్రిల్ మాసంలో వ్యాధినిరోధక టీకాలు ఇప్పించాలి.
- పాకను క్రిమిసంహారిక మందులతో శుభ్రం చేయాలి. పొడి సున్నం చల్లాలి.

**చికిత్స**

- నోటిపుండ్లను 1% పొటాషియం పర్మాంగనేటు ద్రావణంతో కడిగి బోరిక్ గ్లిసరిన్ ఆయింట్‌మెంట్ రుద్దాలి.
- కాలిపుండ్లకు హిమాక్స్, వేపనూనె లేక టాపిక్యూర్ స్ప్రే వంటి మందులు వాడాలి.
- యాంటీ బయోటిక్ మరియు నొప్పి నివారణ మందులు పశువైద్యుల సలహాతో వాడాలి.
- నోటిపుండ్ల వలన గొర్రెలు మేత మేయవు కావున జీవాలకు గంజి లేక అంబలిని గ్లూకోజ్‌తో కలిపి త్రాగించాలి. నీరసపడకుండా సంరక్షించాలి.

# నీలి నాలుక వ్యాధి

(బ్లు టంగ్)

ఈ వ్యాధిని మూతి వాపు, మూతిపుండ్లు, పూత రోగం మొదలగు పేర్లతో వివిధ ప్రాంతాలలో వ్యవహరిస్తారు. వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉన్న గొర్రెలలో నాలుక నీలిరంగుకు మారుతుంది. కావున ఈ వ్యాధిని నీలిరంగు వ్యాధి అని వ్యవహరిస్తారు.

## వ్యాధి ఎలా వస్తుంది?

ఈ వ్యాధి వైరస్ వలన కలుగుతుంది. దోమ కాటు వలన ఈ క్రిములు గొర్రె శరీరంలోనికి ప్రవేశించి వ్యాధిని కలుగజేస్తాయి. వర్షాకాలంలో వ్యాధి క్రిముల అభివృద్ధికి మరియు అవి విస్తరింపచేసే దోమల వ్యాప్తికి అనుకూలంగా ఉంటుంది.

## వ్యాధి లక్షణాలు

- వ్యాధి సోకిన గొర్రెలలో జ్వరం ఎక్కువగా ఉంటుంది.
- క్రమేణా జ్వరం ఉన్న గొర్రెలకు చొంగ కారుతూ, పెదవులు మరియు చిగుళ్ళు వాచి, పెదవుల లోపలి భాగం ఎర్రబడి, చిన్న చిన్న గుల్లలు ఏర్పడతాయి.
- వ్యాధి తీవ్రంగా ఉన్న గొర్రెలలో ఈ వ్యాధి కాళ్ళకు కూడా పాకుతుంది. గిట్టల మొదటి భాగం వాచి, గిట్టల మధ్య ఎర్రగా ఉంటుంది. కావున గొర్రెలు సరిగా నడవలేక మేత సమయంలో వెనుకపడతాయి.
- వ్యాధి చివరి దశలోనాలుక నీలిరంగుకు మారుతుంది మరియు మెడ వంకర పోతాయి.
- వ్యాధి తీవ్రతను బట్టి 5 - 6 రోజులు మేత మేయక, నీరు త్రాగకపోవుట వలన గొర్రెలు నీరసించి చివరికి చనిపోతాయి.

## వ్యాధిని ఎలా నివారించాలి?

- వ్యాధి నివారణ టీకాల ఉత్పత్తికి ప్రస్తుతము పరిశోధనలు చివరి దశలో ఉన్నాయి.
- వర్షాకాలంలో కొట్టం, పరిసర ప్రాంతాలలో ఈగలు, దోమలు లేకుండా చర్యలు తీసు కోవాలి.
- రోజుకు రెండు పర్యాయాలు వేపాకుతో పొగ వేసిన యెడల దోమలను నివారించ వచ్చును.

## చికిత్స

- వ్యాధి లక్షణాలు గమనించిన వెంటనే పశువైద్యుని సంప్రదించి, యాంటిబయోటిక్ మరియు నొప్పి నివారణ మందులు వాడడం ద్వారా వ్యాధిగ్రస్తమైన గొర్రెలు చనిపోకుండా కాపాడుకొనవచ్చును.
- నోటిలోని పుండ్లను 1% పోటాషియం పర్మాంగనేటు ద్రావణంలో కడిగి జింక్ పౌడర్ నీటితో రుద్దాలి. గిట్టల మధ్య వున్న పుండ్లను కడిగి హిమక్స్, నెమ్‌లెంట్ వంటి ఆయింట్‌మెంటులు పూయాలి.

# బొబ్బరోగం

(షిప్ ఫాక్స్)

ఈ వ్యాధిని అమ్మ తల్లి, తల్లవ్య అని తెలంగాణా ప్రాంతంలోను మరియు బొబ్బ రోగం అని రాయలసీమ, ఆంధ్ర ప్రాంతాలలోను పిలుస్తారు. ఈ వ్యాధి సంవత్సరములో ఏ కాలంలోనైనా గొర్రెలకు సోకు తున్నది.

**వ్యాధి ఎలా వస్తుంది?**

- ఈ వ్యాధి సూక్ష్మాతి వైరస్ వలన సోకే అంటువ్యాధి. మన రాష్ట్రంలోన అన్ని ప్రాంతాల గొర్రెలకు, ఈవ్యాధి సోకుతుంది.
- ఇది అంటువ్యాధి కనుక, ఒక ప్రాంతంలోని గొర్రెల నుంచి ఇతర ప్రాంతాల గొర్రెలకు ఈ వ్యాధి క్రమేణా సోకుతుంది.
- వ్యాధి మందలోనికి ప్రవేశించి వరుసగా 2-3 మాసాల వరకు సుమారు 80% జీవాలకు వ్యాధి సోకుతుంది.

**వ్యాధి లక్షణాలు**

- ఆకస్మికంగా మందలోని కొన్ని గొర్రెలు నీరసంగా ఉండి, జ్వరం ఎక్కువగా ఉంటుంది మరియు కళ్ళు ఎర్రబడి నీరు కారుతుంది.
- వ్యాధి సోకిన ఒకటి రెండు రోజులలో వెంట్రుక లేని శరీర భాగాలపై దద్దులేర్పడి, క్రమేణా పెద్దవై, బొబ్బలుగా మారి చీము పట్టడం లేక నలుపురంగుగా మారతాయి.
- వ్యాధి సోకిన గొర్రెలు ఈసుకుపోతాయి. పిల్లలు ఎక్కువగా మరణిస్తాయి.
- వ్యాధి తీవ్రతను బట్టి సుమారు 20-30% వరకు గొర్రెలు చనిపోతాయి.

**వ్యాధిని ఎలా నివారించాలి?**

- ఈ వ్యాధి అంటువ్యాధి కనుక వ్యాధి రాకుండా ప్రతి సంవత్సరం అక్టోబర్ - నవంబర్ మాసాలలో బొబ్బరోగం టీకాలు క్రమం తప్పకుండా వేయించి, ఈ వ్యాధిని నివారించవచ్చు.
- చుట్టు ప్రక్క గ్రామాలలోని గొర్రెలకు ఈ వ్యాధి సోకిన సమాచారం తెలిసిన వెంటనే పశువుల డాక్టరును సంప్రదించి గొర్రెలకు టీకాలు వేయించాలి.
- గొర్రె పెంపకందార్లు వ్యాధి సోకిన గొర్రెల బొబ్బల నుంచి సొన సేకరించి, ఆరోగ్యంగా ఉన్న గొర్రెల చెవులకు పచ్చ వేయిస్తుంటారు. దీని వలన ఆరోగ్యంగా ఉన్న గొర్రెలలో వ్యాధి తీవ్రరూపం దాల్చి ఎక్కువ సంఖ్యలో గొర్రెలు చనిపోతాయి. కావున ఈ పద్ధతిని మాని, టీకాలు వేయించవలయును.

**చికిత్స**

- వ్యాధి సోకిన వెంటనే చికిత్స చేయిస్తే కొన్ని గొర్రెలను కాపాడవచ్చు.
- వ్యాధిగ్రస్తమైన గొర్రెలు మేత తినలేవు. కావున వాటికి అంబలి త్రాగించవలెను.

# పుర్రు రోగం (పి.పి.ఆర్.)

ఈ వ్యాధి ముసర వ్యాధి లేక పెద్ద రోగమును పోలి ఉంటుంది. గత 5,6 సంవత్సరాల నుంచి మన రాష్ట్రంలోని మేకలకు ఈ వ్యాధి సంక్రమిస్తున్నది. ఈ వ్యాధి ఫిబ్రవరి నుండి మే సమయంనందు ఎక్కువగా వస్తుంది. మేక పిల్లలకు తీవ్రంగా సోకుతుంది.

**వ్యాధి ఎలా వస్తుంది?**

ఈ వ్యాధి వైరస్ వలన సంక్రమిస్తుంది. ఇది అంటువ్యాధి, సాధారణంగా క్రొత్తగా కొనుగోలు చేసిన మేకలను మందలో చేర్చిన తరువాత వ్యాధి ప్రబలుతుంది. ఒక జీవం నుండి ఇంకో జీవానికి వ్యాప్తి చెంది 4 నుండి 10 రోజులలో లక్షణాలు బయటపడతాయి.

**వ్యాధి లక్షణాలు**

- వ్యాధి సోకిన మేకలలో జ్వరం తీవ్రంగా ఉంటుంది.(104° F - 106° F)
- జ్వరం గమనించిన రెండు మూడు రోజుల తరువాత, మేకలు పలుచగా పారుకుంటాయి. విరేచనాలు నలుపు రంగులో ఉంటుంది.
- నోరు, పెదవులు, నాలుక, చెంప, కండరముల లోపల భాగాలు ఉబ్బి, పొక్కులు ఏర్పడతాయి.
- వ్యాధి సోకిన మేకలు నీరసంగా ఉండి నల్లకప్పు వేస్తాయి. మేత మేయక ఐదు లేక ఆరు రోజులలో చనిపోతాయి.
- చూడి మేకలు ఈడుసుకునిపోతాయి.

**చికిత్స**

- ఈ వ్యాధికి జనవరి మాసంలో పి.పి.ఆర్. టీకాలు వేయించాలి.
- ఈ వ్యాధికి సరియైన చికిత్స లేనప్పటికి, వ్యాధి లక్షణాలు గమనించిన వెంటనే దగ్గరలోని పశువైద్యుని సంప్రదించి యాంటీబయోటిక్స్, ఇతర మందులతో చికిత్స చేసిన యెడల రోగం తీవ్రతను తగ్గించి కాపాడుకొనవచ్చు.
- పొటాషియం పర్మాంగనేటు 1% ద్రావణంతో నీటిలోని పొక్కులు కడగాలి ఉప్పు, గ్లూకోజు కలిపిన గంజీని త్రాగించడం వల్ల త్వరగా, కోలుకుంటాయి.

# పరాన్నజీవుల వలన వచ్చే వ్యాధులు

## హీమాంకోసిస్ వ్యాధి

ఈ వ్యాధి పరాన్న జీవుల వలన గొర్రెలలో, మేకలలో ఎక్కువగా వస్తుంది. ఈ వ్యాధికారక జీవులు నాల్గవ పొట్ట (సీకం) నందుండి రక్తమును పీల్చుకొనుట ద్వారా జంతువులలో అనీమియా (రక్తహీనత) వంటి లక్షణములను కలుగజేస్తాయి. ఈ పరాన్న జీవుల నుండి విడుదలయగు గ్రుడ్లు పేడ ద్వారా నేల పైకి చేరి తిరిగి ఆహారము ద్వారా శరీరములోనికి ప్రవేశిస్తాయి. గొర్రె పిల్లలు, మేకపిల్లలు, దూడలలోఈ వ్యాధి ఎక్కువగా కనిపిస్తుంది. పెద్ద జంతువులలో ఈ వ్యాధి లక్షణములు సాధారనంగా కనిపించవు.

**వ్యాధి లక్షణాలు**

- తీవ్రమైన వ్యాధి ఉన్నప్పుడు గొర్రె పిల్లలు ఎటువంటి లక్షణములు చూపించకుండా చనిపోతాయి.
- కంటి లోపల మ్యూకస్ మెంబ్రేన్ పాలిపోయి వుంటుంది. రక్తహీనత లక్షణములు కనిపిస్తాయి.
- దవడ క్రింద, కడుపు క్రింద నీరు చేరుతుంది.
- ఆకలి మందగిస్తుంది. మేత, నీరు సరిగా తీసుకొనవు. బరువును కోల్పోతాయి.
- ఎక్కువ సేపు విశ్రాంతి తీసుకొనుటకు ఇష్టపడతాయి.
- నడుచునపుడు అడుగులు తడబడ వచ్చును.
- మలబద్ధకము ఉండును.

**నివారణ**

ఈ వ్యాధి పెద్ద జీవాల నుండి చిన్న జీవాలకు సులభముగా వ్యాప్తి చెందుతుంది. చూడి జీవాలలో ఈనుటకు 15 రోజుల ముందు తప్పని సరిగా నట్టల మందు త్రాగించవలెను. జీవాల దొడ్లను, షెడ్లను ఎప్పటికప్పుడు శుభ్రపరచవలెను. పెద్దజీవాలను, చిన్న జీవాలను ఒకే చోట మేపుకొనరాదు.

## పొట్టజలగ వ్యాధి

(రౌండ్ వార్మ్స్)

గొర్రెల పెంపకందార్లకు ఆర్థికంగా నష్టం కలుగజేసే వ్యాధులలో ఈ వ్యాధి కూడా ముఖ్యమైనది. ఈ వ్యాధి ఎక్కువగా డిశంబరు నుండి ఫిబ్రవరి మాసాలలో ఎక్కువగా కనబడుతుంది.

**వ్యాధి ఎలా వస్తుంది?**

ఈ వ్యాధి అంతరపరాన్నజీవులైన పొట్టజలగల వలన వస్తుంది. పొట్టజలగలను వ్యాప్తి చేయుటలో నత్త గుల్లలు మాధ్యమిక పాత్ర వహిస్తాయి. వ్యాధివచ్చు కాలం అయిన డిశంబరు, జనవరి మరియు ఫిబ్రవరి మాసాలలో గుంటలు మరియు చెరువులలోని నీరు తగ్గి, చుట్టు ప్రక్కల పచ్చిక

ఎక్కువగా పెరుగుతుంది. ఈ కాలంలోనే నత్తలు ఎక్కువగా ఉండి, పచ్చిగడ్డిని కలుషితం చేస్తాయి. ఈ గడ్డిని తినుట వల్ల గొర్రెలకు ఈ వ్యాధి సంక్రమిస్తుంది.

**వ్యాధి లక్షణాలు**

- వ్యాధితో ఉన్న మందలోని కొన్ని గొర్రెలలో దవడ క్రింద వాపు వస్తుంది. ఈ వాపు సాయంత్రం కనబడి, ఉదయానికి తగ్గిపోతుంది.
- వ్యాధి సోకిన కొన్ని గొర్రెలలో ఎక్కువసారు పలుచని విరేచనాల్లు అవుతాయి.
- వ్యాధిగ్రస్తమైన గొర్రెలకు చికిత్స చేయని యెడల, రక్తక్షీణత కలిగి నీరసించి 7-8 రోజులలో చనిపోతాయి.

**వ్యాధిని ఎలా నివారించాలి**

- పశువైద్యుని సలహాల మేరకు గుంటలు మరియు చెరువులలోని నత్తగుల్లల నివారణ చర్యలు తీసుకొనవలయును.
- వ్యాధిసోకే కాలంలో చెరువుల దగ్గర లభించే పచ్చిగడ్డిని గొర్రెలకు మేపకూడదు.

**చికిత్స**

- పేడ పరీక్ష ద్వారా వ్యాధి నిర్ధారించబడిన తరువాత వైద్యుని సలహా ప్రకారం తగు మోతాదులో మందులు వాడాలి. లివర్ టానిక్కులు, ఖనిజ లవణ మిశ్రమాలు హిమాలయన్ బత్తిస వంటి మందులు వాడాలి.

## కార్జపు జలగ వ్యాధి

(లివర్ ఫ్లుక్స్)

ఈ వ్యాధిసోకిన గొర్రెల కార్జం మీద ఎక్కువగా అంతర్ పరాన్న జీవులు కనిపిస్తాయి. కావున ఈ వ్యాధిని కార్జపు జలగరోగంగా పిలుస్తారు. ఏప్రిల్ నుండి ఆగష్టు మాసాలలో ఎక్కువగా కనపడుతుంది. ముఖ్యంగా ఆయకట్టు ప్రాంతాలకు వలసవెళ్లే గొర్రెలకు ఈ వ్యాధి సోకుతుంది.

**వ్యాధి ఎలా వస్తుంది?**

ఈ వ్యాధి వ్యాప్తిలో నత్త గుల్లలు ప్రముఖ పాత్ర వహిస్తాయి. వ్యాధి కారణాలు నత్తగుల్లలు, పచ్చిగడ్డి మీద వదిలి పెడతాయి. ఈ గడ్డిని తినుట వలన గొర్రెలకు కార్జపు జలగరోగం వస్తుంది. గొర్రె చనిపోయిన తరువాత కోసినప్పుడు కార్జం మీద లేక కార్జం లోపల పసుపు పచ్చ జలగలను గమనించవచ్చు.

**వ్యాధి లక్షణాలు**

- మందలోని కొన్ని గొర్రెలు ఎటువంటి వ్యాధిలక్షణాలు లేకుండా వెంటనే చనిపోతాయి. ఇటువంటి గొర్రెలను శవపరీక్ష చేసిన తరువాత కార్జం మీద జలగలను గమనించవచ్చును.

- కొన్ని గొర్రెల్లో దవడ క్రింద వాపు కొద్దిగా గమనించవచ్చును.
- వ్యాధి సోకిన గొర్రెలకు చికిత్స చేయని యెడల, నీరసించి ఐదు లేక ఆరు రోజులలో చనిపోతాయి.

**వ్యాధిని ఎలా నివారించాలి**

- వలస ప్రాంతంల్లోని గొర్రెలకు ముందు జాగ్రత్త చర్యగా పశువైద్యునిచే పేడ పరీక్ష చేయించి, వ్యాధి కారకాలు ఉన్నచో నివారణ కొరకు చర్యలు తీసుకొనవలయును.
- వలస ప్రాంతాల్లో నత్తగుల్లలను గమనించినచో మేత ప్రాంతాన్ని మార్చాలి. ఆయ కట్టు ప్రాంతాలకు వలస వెళ్లే గొర్రెలకు ముందు జాగ్రత్త చర్యగా నట్టల నివారణ మందులను త్రాగించాలి.

**చికిత్స**

- పేడ పరీక్ష ద్వారా వ్యాధి నిర్ధారణకాగానే మందులు పశువైద్యుని సలహాప్రకారం తగు మోతాదులో వాడాలి మరియు లివర్ టానిక్కులు వాడాలి.
- వ్యాధి లక్షణాలు గమనించిన వెంటనే పశువైద్యున్ని సంప్రదించి, రఫ్యాక్సనైడ్ అనే నట్టల మందును తాగించాలి దీని ద్వారా వ్యాధిగ్రస్తమైన గొర్రెలను చనిపోకుండా కాపాడవచ్చును.

## బద్దె పురుగు వ్యాధి

(టేప్ వార్మ్స్)

మూడు నుండి ఆరు మాసాల గొర్రె పిల్లలో బద్దె పురుగు వ్యాధిని ఎక్కువగా గమనించవచ్చు. ఈ వ్యాధి వలన గొర్రె పిల్లలు ఎక్కువగా చనిపోవడం వల్ల గొర్రెల పెంపకందారునికి తీవ్ర ఆర్థికంగా నష్టం కలుగుతుంది.

**వ్యాధి ఎలా వస్తుంది?**

అంతర్ పరాన్నజీవుల వలన ఈ వ్యాధి సంక్రమిస్తుంది. పచ్చిక బయళ్ళలోని గడ్డి ద్వారా, గొర్రెల కడుపులోనికి ప్రవేశించి చిన్న ప్రేగుల్లో పెరుగుతాయి. ఈ వ్యాధి ఏ కాలంలోనైనా రావచ్చును.

**వ్యాధి లక్షణాలు**

- గొర్రె పిల్లలో పెరుగుదల క్షీణిస్తుంది.
- మందలోని కొన్ని గొర్రెపిల్లలు వెంట వెంటనే చనిపోతుంటాయి. కొన్ని సందర్భాలలో మూక్కుమ్మడి మరణాలు కూడా గమనించవచ్చు.
- వ్యాధిగ్రస్తమైన గొర్రెపిల్లలో విరేచనాలు గమనించవచ్చు.
- తెల్లటి కణుపులు లాంటి బద్దెపురుగుల కణాలను విరేచనాలలో గమనించవచ్చు.

### వ్యాధిని ఎలా నివారించాలి

- ముందు జాగ్రత్త చర్యగా ప్రతి నెలా, కొన్ని గొర్రెపిల్లల పేడను సేకరించి పశువైద్యునిచే పరీక్ష చేయించాలి.
- పశువైద్యుని సలహా మేరకు నివారణగా తగిన మందులను గొర్రెలకు త్రాగించవలెను.

### చికిత్స

- పేడ పరీక్ష ద్వారా వ్యాధి నిర్ధారణ జరిగిన తరువాత నిక్లోసమైడ్ వంటి నట్టల మందుల్ని వైద్యుల సలహా ప్రకారం వాడాలి. అలాగే గొర్రెలు బలహీనపడకుండా తగిన మందులు, టానిక్కులు వాడాలి.

## బాహ్యపరాన్నజీవుల బెడద

బాహ్యపరాన్నజీవులు గొర్రెల చర్మమును ఆశించి వివిధ రకాల చర్మవ్యాధుల్ని కలుగజేస్తాయి.

### వ్యాధి ఎలా వస్తుంది?

పేలు, గోమార్లు, మిన్నల్లులు, పిడుదులు మొదలగు బాహ్యపరాన్నజీవులు మరియు వాటి గ్రుడ్లు గొర్రెలలో వివిధ రకాల చర్మవ్యాదులు కలగజేస్తాయి.

### వ్యాధి లక్షణాలు

- చర్మముపై చిన్న చిన్న మచ్చలు ఏర్పడి, శరీరమంతా వ్యాపిస్తాయి.
- వెంట్రుకలు, ఉన్ని రాలిపోతాయి.
- గొర్రెలు విపరీతమైన దురదతో బాధపడతాయి. తమ శరీరాన్ని గోడలకు, చెట్లకు రాసుకుంటుంటాయి. చర్మముపై పుండ్లు, పొక్కులు ఏర్పడతాయి.
- గొర్రెపిల్లలు రక్తక్షీణత, నీరసంతో మరణిస్తాయి.
- గొర్రెల బరువు తగ్గి, ఆర్థిక నష్టం కలుగుతుంది.

### వ్యాధిని ఎలా నివారించాలి

- బుటాక్స్, నియోసిడాల్ వంటి క్రిమి సంహారకమందులతో, 2-3 నెలలకొకసారి, గొర్రెలకు స్నానం చేయించాలి.
- పాకల్లో కూడా మందుల్ని పిచికారి చేయాలి.
- పాకల్లో వేపాకు పొగ వేసినచో బాహ్మపరాన్నజీవులను నివారించబడతాయి.
- ఈ వ్యాధులు మనుషులకు కూడా వ్యాపిస్తాయి. కావున జీవాలవద్ద ఉన్నవారు జాగ్రత్త వహించాలి.

**చికిత్స**

- బుటాక్స్, నియోసిడాల్ వంటి క్రిమిసంహారక మందులు కలిపిన నీటి తొట్లలో లేదా డిప్‌లలో గొర్రెలను స్నానం చేయించాలి.
- హిమాక్స్, నీమ్‌లెంట్, సల్ఫర్ వంటి మందులు చర్మం పైగల పుండ్లకు పూయాలి.
- పశువైద్యుని సలహాతో ఇతర మందులను వాడాలి.
- గొర్రెలకు పుష్టికరమైన మరియు సమతుల్యమైన ఆహారం ఇవ్వాలి.

## గొర్రెల ఆరోగ్య సూచిక

| మాసం | చేపట్టాల్సిన కార్యక్రమం |
|---|---|
| జనవరి | పి.పి.ఆర్. వ్యాధి సోకకుండా మేకలకు టీకాలు వేయించాలి.<br>దక్కని, బళ్ళారి జాతి గొర్రెల ఉన్ని మొదటిసారి కత్తిరించివేయాలి. |
| ఫిబ్రవరి | గోమార్ల నిర్మూలనకు మందులు పిచికారి చేయాలి. |
| మార్చి | మొదటిసారి నట్టల మందులు త్రాగించాలి. |
| ఏప్రిల్ | గాలికుంటు వ్యాధి సోకకుండా గొర్రెలకు టీకాలు వేయించాలి. |
| మే | చిటుకు రోగం వ్యాధి సోకకుండా గొర్రెలకు టీకాలు వేయించాలి. |
| జూన్ | రెండవసారి నట్టల మందులు త్రాగించాలి. |
| జూలై | దక్కని, బళ్ళారి జాతి గొర్రెల ఉన్ని రెండవసారి కత్తిరించివేయాలి. |
| ఆగస్టు | గోమార్ల నిర్మూలనకు మందులు పిచికారి చేయాలి |
| సెప్టెంబరు | మూడవసారి నట్టల మందులు త్రాగించాలి |
| అక్టోబరు | అవసరమున్న ప్రాంతాలలో దొమ్మ వ్యాధి సోకకుండా గొర్రెలకు టీకాలు వేయించాలి |
| నవంబరు | అమ్మతల్లి వ్యాధి సోకకుండా గొర్రెలకు టీకాలు వేయాలి |
| డిశంబరు | అవసరాన్ని బట్టి నాల్గవసారి నట్టల మందులు త్రాగించాలి |

# కోళ్ళలో వ్యాధులు

## వైరస్ వలన కలిగే వ్యాధులు

### కొక్కెర తెగులు (రానికెట్ రోగం)

ఈ వ్యాధి మిగతా వ్యాధులన్నింటి కంటే అతి భయంకరమైనది. ఈ వ్యాధి వల్ల ఎక్కువ సంఖ్యలో కోళ్ళు చనిపోతాయి. ఈ వ్యాధి ఏ వయసు కోళ్ళకైనా రావచ్చు. ఈ రోగానికి గురైన కోళ్ళు ముడుచుకొని ఉండి రెక్కలు వ్రేలాడదీస్తాయి. పక్షవాతపు లక్షణాలు కనిపిస్తాయి. మెడ వెనక్కి వాలుతుంది. విరేచనాలు తెలుపు, ఆకుపచ్చ రంగులో ఉంటాయి. శ్వాసలో కూడా ఇబ్బంది కలుగుతుంది. సన్నని రక్తపు గడ్డల చుక్కలు గిజర్డు మరియు పెరికార్డియంలో కనబడతాయి. ప్రొవెంట్రిక్యులస్‌లో సన్నని రక్తపు చుక్కలుంటాయి. ప్రేగులో పొరలు ఎర్రబారటం, సీకా జంక్షన్‌లో రక్తపు జీరలుంటాయి. ప్రేగుల్లో అల్సర్స్ ఉండవచ్చు. నివారణకు మొదటి వారం, 4వ వారం, ఆ తరువాత 6-8 వారాల మధ్య మరొకసారి, చివరిగా 20వ వారం టీకాలు వేయటం వలన చాలా వరకు కోళ్ళను ఈ రోగం నుండి రక్షించుకొనవచ్చును.

### కోళ్ళ మశూచి (ఫౌల్ ఫాక్స్)

కోళ్ళ అంటువ్యాధుల్లో ముఖ్యమైనది. ఈ వ్యాధి వలన గ్రుడ్ల ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోవుటం లేదా కోళ్ళు చనిపోవుటం జరుగుతుంది. మశూచి సోకిన కోళ్ళకు జుట్టుమీద, తుమ్మెలకు, కనురెప్పల చుట్టు పొక్కులు ఏర్పడతాయి. అప్పుడుప్పుడు కళ్ళల్లో కూడా ఈ పొక్కులు వచ్చి కళ్ళు కనబడవు. నివారణకు టీకాలు వేయించడం ఒక్కటే మార్గం. ఇవి 6-7 వారాల వయస్సులోనూ మరల 16-17 వారాల మధ్య వేయాలి.

### కొరైజా

కోడి పిల్లలు సరిగా నీటిని, మేత తీసికొనక బరువును కోల్పోతాయి. ముక్కునుండి, కళ్ళనుండి నీరు కారుట రోగ లక్షణాలు. కళ్ళల్లో ఉబ్బి తెల్లని చీము గడ్డలుగా తయారవుతాయి. మరణసంఖ్య చాలా తక్కువగా ఉంటుంది. ఒకసారి ఈ వ్యాధి క్రిములు షెడ్డులోనికి ప్రవేశించిన, అన్ని బ్యాచ్‌లకు ఈ రోగం వస్తూనే వుంటుంది. ఒక బ్యాచ్‌లో ఈ వ్యాధి వచ్చినప్పుడు కొద్ది రోజులు షెడ్డు ఖాళీగా పెట్టి, బ్లోలాంప్‌తో నేల, గోడలను కాల్చాలి. సున్నం, గమాక్సిన్, ఫినాయిల్, బ్లీచింగ్ పౌడర్ కలిపి వెల్లవేయాలి. లిట్టరు ఎల్లప్పుడు పొడిగా ఉండేలా చూడాలి. రోగం సోకిన పిల్లలకు హెూస్టసైక్లిన్, ప్లాక్సెడ్ లేక ఇతర యాంటిబయాటిక్ మందులు విటమిన్‌తో కలిపి వారం రోజులు వాడిన ఎడల పూర్తిగా నయమవుతుంది.

## బ్యాక్టీరియా వలన కలిగే వ్యాధులు

### పుల్లోరం

చిన్న పిల్లలు ఎక్కువగా గురికాబడతాయి. ఈ వ్యాధి తల్లి నుండి పిల్లలకు గుడ్ల ద్వారా కూడా సంక్రమిస్తుంది. రోగం సోకిన పిల్లలు గుంపులుగా గుమికూడటం, భారంగా శ్వాసతీయడం, రెక్కలు వాల్చడం గమనించవచ్చు. తెల్లని రెట్ట మలద్వారం వద్ద అంటుకొని

ఉంటుంది. గుండె, గిజర్డ్, కాలేయం మరియు పేగులపై తెల్లని మచ్చలు కనిపిస్తాయి. నివారణకు ఆంటీ బయాటిక్ మందులు వాడాలి. ఇవికాక కోళ్ళ కలరా, ఇన్‌ఫెక్షియస్ కోరైజా అనే రోగాలు కూడా సోకవచ్చు.

### ఎస్సరీషియా కొలై

బ్రాయిలర్ పిల్లల్లో ఈ వ్యాధి తీవ్రంగా వస్తుంది. బాక్టీరియా వల్ల కలిగే ఈ వ్యాధితో బ్రాయిలర్స్‌లో బరువు సరిగ్గా రాకపోవడం వల్ల నష్టం వాటిల్లుతుంది. ఈ వ్యాధి సోకిన కోడి పిల్లలు నీరసంగా ఉండి మేత సరిగా తినకపోవడం జరుగుతుంది. మరణించిన కోడి పిల్లల ప్రేగులు ఉబ్బి ఉంటాయి. యాంటిబయాటిక్స్ మందులు మేతలో మరియు నీటిలో వాడితే ఈ వ్యాధి సోకిన పిల్లలను కాపాడవచ్చు. త్రాగు నీటితో పాటు సేనిటైజర్ మందును కోళ్ళకు ఇవ్వడం ద్వారా ఈ వ్యాధి రాకుండా నివారించకొనవచ్చు.

## అంతర పరాన్న జీవుల వలన కలిగే వ్యాధి

### కాక్సీడియోసిస్ (రక్తపారుడు రోగం)

ప్రోటోజోవా వలన సోకే ఈ వ్యాధితో తరచు బ్రాయిలర్ కోళ్ళ పరిశ్రమ తీవ్ర నష్టానికి గురవుతుంది. బ్రాయిలర్స్ అధిక సంఖ్యలో మరణించడం, రోగం నుంచి కోలుకున్న పిల్లల్లో బరువు సరిగా రాకపోవడం జరుగుతుంది. మేతలో కాక్సిడియోస్టాట్స్ సరియైన మోతాదుల్లో వాడనపుడు గాని, అసలు వాడక పోవడం వలన గాని ఈ వ్యాధి వస్తుంది. 11వ రోజునుండి 8వ వారం లోపల ఎప్పుడైన ఈ వ్యాధి బ్రాయిలర్ పిల్లలకు సోకవచ్చు. రోగం సోకిన పిల్లలు మూలలకు గుమిగూడి సుస్తిగా ఉంటాయి. ఎరువు వర్ణం గల రెట్టను చూడవచ్చు. మేత మరియు నీరు తక్కువ తీసుకొంటాయి. మరణించిన పిల్లల ప్రేవులు ఉబ్బి రక్తం కలిగి ఉంటాయి. మేతలో మరియు నీటిలోకాక్సీడియోస్టాట్ మందులు తగు మోతాదులో వాడితే ఈ రోగాన్ని నివారించవచ్చు.

## టీకాల మందుల వాడకంలో జాగ్రత్తలు

- టీకా మందులు ఎప్పుడు ఐస్‌లో లేక ఫ్రిజ్‌లో ఉంచాలి
- ఇతర రోగాలున్నప్పుడు టీకాలు వేయకూడదు
- కోళ్ళు అస్వస్థత లేదా స్ట్రెస్‌తో ఉన్నప్పుడు టీకాలు వేయరాదు
- టీకాలు ఉదయం లేక సాయంత్రం వేళల్లో వేయడం మంచిది
- టీకా మందు సీసా నుండి తీసి కలిపిన తరువాత 2 గంటలలోపే వాడాలి

# టీకా మందుల పట్టిక

| క్ర.సంఖ్య | వ్యాధి పేరు | టీకా మందు | టీకా మందు మోతాదు/ ఇచ్చే విధానం | ధర |
|---|---|---|---|---|
| 1. | గొంతు వాపు, జబ్బ వాపు, గాలి కుంటు వ్యాధికి | రక్ష ట్రయోవ్యాక్ | పశువులకు-3 మి.లీ. జీవాలకు-1 మి.లీ./ తుంటి కండరానికి | రూ. 192 / 30 మి.లీ. |
| 2. | చిటుకు రోగము | చిటుకు రోగం టీకా | జీవాలకు-2 మి.లీ./ చర్మం క్రింద | రూ. 10  100 మి.లీ. |
| 3. | పుర్రు రోగము | రక్ష పి.పి.ఆర్. టీకా | జీవాలకు-1 మి.లీ./ చర్మం క్రింద | రూ. 414/100 డోసులు. |
| 4. | రేబిస్ రోగము | రక్ష రేబిస్ టీకా | అన్ని జీవులకు-1 మి.లీ./ చర్మం క్రింద / తుంటి కండరానికి (ఒక వేళ కుక్క కరిచిన తరువాత 0, 3,7, 14, 28, 90వ రోజు టీకా మందును ఇప్పించుకోవాలి | రూ. 100/1 మి.లీ. |
| 5. | గొర్రెల్లో మశూచి రోగము | రక్ష షీప్ ఫాక్స్ టీకా | జీవులకు-1 మి.లీ./ చర్మం క్రింద | రూ. 301/100 డోసులు. |
| 6. | కొక్కెర రోగము | ఆర్.డి. టీకా | కోళ్ళకు-0.5 మి.లీ./ చర్మం క్రింద (మెడ దగ్గర)/ తుంటి కండరానికి | రూ. 22/100 డోసులు. |

**గమనిక :** పైన తెలిపిన టీకా మందులు రాష్ట్ర పశుసంవర్ధకశాఖ ఉచితంగా సరఫరా చేస్తుంది.